

తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.88,780
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.8,026
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.99,300
రిటైల్ వెండి గ్రాము	రూ.102.30

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో నియామకం



జ్ఞానజగదీష్

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామకం చేపట్టారు. మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా చిత్తూరు సంతపేటకు చెందిన జ్ఞాన జగదీష్‌ను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ఈ మేరకు గురువారం ఆయనకు ఉత్తర్వులు అందాయి.

ఆలయానికి గ్రానైట్ వితరణ

రామచంద్రాపురం (తిరుపతి రూరల్) : రామచంద్రాపురం మండలం పరమాలలో నిర్మించిన ఆరిమాను గంగమ్మ ఆలయానికి గ్రామస్తుల అభ్యర్థన మేరకు ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ 1200 చదరపు అడుగుల గ్రానైట్‌ను వితరణ చేశారు. దాని విలువ రూ.70 వేలు ఉంటుంది. ఆయనకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పద్మావతి

తిరుపతి సిటీ: ఎస్వీయూ సైన్స్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ పద్మావతి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆమెకు 31 ఏళ్ల బోధన, పరిశోధన రంగాలలో విశేష అనుభవం ఉంది. ఆమెను వర్సిటీ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

మంగళంలో భూ వివాదం

తిరుపతి మంగళం: తమ భూమిని కొందరు ఆక్రమించుకుంటున్నారని పావని అనే మహిళ తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం ఆందోళనకు దిగింది. తిరుపతి అర్బన్ మండలం మంగళం పరిధిలోని మిట్టగాంధీపురం సమీపంలోని మంగళం రెవెన్యూ దాఖలా సర్వే నంబర్ 78/2, 78 /2 బి 1లోని భూమిలో జరుగుతున్న నిర్మాణాలను ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. అమర్‌నాథ్‌రెడ్డి, కిరణ్ తనని మోసం చేయడంతోపాటు తనపై దౌర్జన్యానికి దిగుతున్నారని పావని ఆరోపించారు.

చలో విజయవాడకు వెళ్లొద్దని ఆశా వర్కర్లకు హుకుం

చంద్రగిరి: హామీలు నెరవేర్చాలని కోరుతూ ఆశా వర్కర్లు గురువారం చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. చంద్రగిరి మండలం నుంచి కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొంటే చర్యలు తప్పవని మెడికల్ అధికారులు హెచ్చరించారు. ఉదయం 9 గంటలకల్లా ప్రతి ఆశా వర్కర్ విధుల్లో ఉన్నట్లు గ్రూపుల్లో ఫొటోలు పెట్టాలని ఆదేశించారు. అధికారుల తీరుపై ఆశా వర్కర్ల తిరుపతి జిల్లా యూనియన్ సభ్యులు మండిపడుతున్నారు. ఆశా వర్కర్ల గొంతునులిమే చర్యలను మానుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

నేత..మేత

ఉపాధి నిధులతో ఇష్టారాజ్యంగా సిమెంట్ రోడ్లు

- అనుమతి ఒకచోట.. నిర్మాణం మరో చోట
- కూటమి నేతల ఇళ్ల దగ్గరే రోడ్ల నిర్మాణం
- అయోమయంలో పేద జనం



తూర్పుకనుపూరులో రోడ్డు వేయల్సిన వీధి



కలకొండలో తాగునీటి బావి వద్దకు సీసీ రోడ్డు వేయల్సి ఉండగా ఇంకా మొదలు పెట్టని పనులు



తిక్కవరంలో ఎమ్మెల్యే శంకుస్థాన చేసిన ఇంకా ప్రారంభం కాని పనులు

చిల్లకూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులు కూటమి నేతలకు కల్పతరువుగా మారాయి. పల్లె పండుగ పేరుతో గ్రామాలలో ఇష్టారాజ్యంగా సిమెంట్ రోడ్లు నిర్మించి నిధులు బొక్కేశారు. ఒక గ్రామంలో రెండు పార్టీలకు చెందిన నేతలు ఉంటే వారికి సమానంగా అధికారులు పనులు అప్పగించారు. ఇంకా ముఖ్యమైన నేతలు ఉంటే అక్కడ నిధులు మరింతగా ఖర్చు చేసేలా పనులకు ఎస్టిమేషన్లు సిద్ధం చేశారు.

చిల్లకూరు మండలం వివరాలు	
సచివాలయాలు	17
పంచాయతీలు	30
గ్రామాలు	64
పనుల సంఖ్య	54
ప్రస్తుతం చేసిన పనులు	30
మంజూరైన నిధులు	రూ.2.73 కోట్లు
ఖర్చు చేసింది	రూ.1.5 కోట్లు
మొత్తం సీసీ రోడ్లు మీటర్లలో	6,396
పూర్తి చేసింది	3,690
పాత రోడ్డుపైనే రోడ్డు నిర్మాణం	1
నేతల ఇళ్ల వద్దకు వేసుకున్న రోడ్లు	3
ఇష్టానుసారంగా చేసిన పనులు	6
పనులు దక్కించుకున్న కూటమి నేతలు	45 మంది

అను'మతి ఉందా'?

చాలా గ్రామాలలో అనుమతులు ఒక చోట.. పనులు చేసేది మరో చోటగా మారింది. తమకు నచ్చిన చోట, తమ ఇళ్ల దగ్గరకు ఉండేలా కూటమి నేతలు సీసీ రోడ్లు నిర్మించారు. కొన్ని గ్రామాల్లో రెండు నెలలు పూర్తి కావస్తున్నా ఇప్పటి వరకు సగం పనులు కూడా పూర్తిచేయలేదు. దళిత, గిరిజన కాలనీల్లో ఇంకా పనులు మొదలు పెట్టలేదు. సీసీ రోడ్డు పనులు ఆరంభించిన సమయంలో స్థానిక ప్రజాప్రతినిధి ఫొటో ఉన్న శిలాఫలకాలను ఆవిష్కరించి చేతులు దులుపుకున్నారు.



నాయకుల ఒత్తిడితో తమకు అనుకూలంగా ఉన్న వారి ఇంటి వద్దకు వేసిన రోడ్డు

నాణ్యతకు తిలోదకాలు

- తీర ప్రాంతంలోని పలు గ్రామాలలో ఇసుకకు బదులుగా సిలికాను వినియోగించారు. అధికారులు సూచించిన సిమెంటు కాకుండా మరో బ్రాండ్ సిమెంటును వినియోగించి పనులు పూర్తి చేశారు.
- కంకరలోనూ కక్కుర్తి పడి లోకల్‌లో దొరికే చిప్స్ వేసి రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు.
- రోడ్డుకు అడుగు భాగంలో ప్లాస్టిక్ పట్ట వేయాలి. అలాగే రోడ్డు మధ్యలో పది అడుగులకు ఒక చోట బెర్ములు అమర్చాలి. కానీ వాటిని ఎక్కడా చేపట్టలేదు.
- రోడ్డు నిర్మాణం చేపట్టే సమయంలో ఆయా సచివాలయాలయాల ఇంజినిరింగ్ అసిస్టెంట్లు దగ్గరుండి పనిచేయించాలి. ఒకేసారి రెండు మూడు చోట్ల పనులు జరుగుతుండడంతో పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయలేక పోయారు.

చిల్లకూరు మండలంలో పరిస్థితి ఇదీ

- మండలంలోని ఓడూరు గ్రామంలో గత 20 ఏళ్ల క్రితం నిర్మించిన సీసీ రోడ్డుపైనే మళ్లీ సిమెంట్ రోడ్డు నిర్మించారు. గతంలో వేసిన రోడ్డు ఎత్తు తగ్గి పోవడమే కాకుండా అక్కడక్కడా పగిలిపోయిందన్న సాకుతో సీసీ రోడ్డును కొంత భాగం తొలగించి దాని స్థానంలో కొత్త రోడ్డు వేశారు. దీనిపై ఉపాధి, పీఆర్ అధికారులు ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు.
- తీర ప్రాంతంలో ఉన్న తమ్మినపట్నం పంచాయతీలో మత్స్యకార కాలనీ అయిన కొత్తూరులో సీసీ రోడ్డు వేయాల్సి ఉండగా అక్కడ కాకుండా గ్రామంలో రోడ్డు వేస్తున్నట్లు ఎస్టిమేషన్లు మార్చి గ్రామంలోని నాయకుల ఇంటి ముందు సిమెంట్ రోడ్డు నిర్మించారు. నిబంధనలకు విరుద్ధంగా సీసీ రోడ్డు పూర్తిచేశారు.
- తీర ప్రాంతంలోని వేళ్లపాళెంలో సీసీ రోడ్ల నిర్మాణానికి స్థానిక ప్రజాప్రతినిధి శిలాఫలకం వేశారు. ఇక్కడ సీసీ రోడ్డు నిర్మాణంలో వాడాల్సిన ఇసుక బదులుగా ఈ ప్రాంతంలో లభించే సిలికాను వినియోగించారు. దీనిపై పీఆర్ ఏఈని వివరణ క్వారగా క్వాలిటీ కంట్రోల్ అధికారులు చూసుకుంటారని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు.
- తీర ప్రాంతంలోని మోమిడి గ్రామంలో రెండు సీసీ రోడ్లు నిర్మాణం చేపడితే ఇసుకకు ప్రత్యామ్నాయంగా అక్కడ దొరికే సిలికాను వాడారు. క్యూరింగ్ కూడా సక్రమంగా చేయలేదు.
- మండల తీర ప్రాంతలలోని తూర్పుకనుపూరు గ్రామంలో వేసిన సీసీ రోడ్లు ఒక వీధిలో వేయాల్సి ఉండగా తమకు అనుకూలమైన వారి ఇంటికి వెళ్లేలా అలైన్‌మెంట్ మార్చి రోడ్డు పనులు పూర్తి చేశారు. ఈ రోడ్డు వేసేందుకు స్థానిక నాయకులు ఆ ఇంటి యజమాని నుంచి కొంత మొత్తం వసూలు చేసుకున్నట్టు తెలుస్తోంది.
- దళిత, గిరిజనకాలనీల్లో ఇంకా సీసీరోడ్లు నిర్మించలేదు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైం : పోలీసు ఉద్యోగంలో విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ప్రొఫెషనరీ సబ్ ఇన్‌స్పెక్టర్లకు ఎస్పీ హర్షవర్ధన్ రాజు దిశానిర్దేశించారు. గురువారం పోలీస్ అతిథి గృహంలో 39 మంది ప్రొబిషనరీ సబ్ ఇన్‌స్పెక్టర్లతో ఆయన సమావేశమయ్యారు. సమాజంలో పోలీస్ పాత్ర చాలా విలువైనదని చెప్పారు. నిరంతరం పోలీసులను ప్రజలు గమనిస్తూనే ఉంటారని తెలిపారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి హేమంత్‌పాల్గొన్నారు.

రేపటి నుంచి తుడా టవర్స్‌కి వేలం

తిరుపతి తుడా: తిరుపతి నగరంలోని అన్నమయ్య కూడలి వద్ద తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ నిర్మిస్తున్న తుడా టవర్స్ ఫ్లాట్లకు శనివారం నుంచి వేలం నిర్వహించనున్నట్టు ఉపాధ్యక్షులు ఎస్.మౌర్య తెలిపారు. నిర్మాణంలో ఉన్న తుడా టవర్స్‌ని గురువారం ఆమె ఇంజినీరింగ్ అధికారులతో పరిశీలించారు. వేలం నిర్వహణపై తుడా కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాయలచెరువు రోడ్డులో తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా 3.6 ఎకరాలలో తుడా టవర్స్‌ను నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఇందులో గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు 13 అంతస్తులలో తుడా టవర్స్ నిర్మాణం జరుగుతోందని, గ్రౌండ్, ఒకటవ అంతస్తుల్లో 27 దుకాణాలతో వాణిజ్య సముదాయాలు, రెండు, మూడు, నాలుగు అంతస్తుల్లో ఆఫీస్‌ల వినియోగానికి, మిగిలిన అంతస్తుల్లో నివాస యోగ్యంగా 2, 3, 4 బెడ్ రూమ్ ఫ్లాట్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. నివసించేందుకు 230 ఫ్లాట్లు ఉంటాయని, అందులో 46 డబుల్ బెడ్ రూమ్స్, 152 ట్రిబుల్ బెడ్ రూమ్స్, 32 నాలుగు బెడ్ రూమ్స్ ఫ్లాట్స్ ఉంటాయని చెప్పారు. శనివారం 2, 3 అంతస్తులకు, 9వ తేదీ 4,5, అంతస్తులకు, 10వ తేదీ 6, 7 అంతస్తులకు, 11న 8,9 అంతస్తులకు, 12న 10, 11 అంతస్తులకు ఉదయం 10 నుంచి 1 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వేలం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో కార్యదర్శి వెంకటనారాయణ, సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర ఉన్నారు.

శ్రీనివామంగాపురంలో ఉద్రిక్తత

- శ్రీకనకదుర్గమ్మ ఆలయం మాదంటే.. మాదే అంటూ సింగ్‌లు, గ్రామస్తుల మధ్య గొడవ
- రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సింగ్‌లతో ఆలయం పేరుతో ట్రస్ట్
- ఇటీవల వర్షాలకు కూలిపోయిన ఆయన ప్రహరీ
- చందాలు వేసుకుని పునర్నిర్మాణానికి సిద్ధమైన గ్రామస్తులు
- మేమే నిర్మిస్తామంటూ అడ్డుకున్న సింగ్‌లు
- ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణ





ఇరువర్గాలతో మాట్లాడుతున్న పోలీసులు, ప్రహరీ పునర్నిర్మాణానికి సిద్ధం చేసిన గ్రామస్తులు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని ఓ ఆలయం వద్ద గురువారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆలయం మాదంటే.. కాదు మాది అంటూ.. ఇరు వర్గాలు వాదనలకు దిగడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. వివరాల్లోకెళితే.. శ్రీనివాసమంగాపురం గ్రామంలోని శ్రీవారిమెట్టు మార్గం ప్రారంభంలో అతి ప్రాచీనమైన శ్రీకనకదుర్గమ్మ ఆలయం ఉంది. ఈ ఆలయంలో అమ్మవారిని గ్రామస్తులతో పాటు తరతరాలుగా పూసల సంఘం(సింగ్) సభ్యులు కొలుచుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు అమ్మవారి ఆలయ ప్రహరీ కూలిపోయింది. దీంతో గ్రామస్తులు చందాలు వేసుకుని ప్రహరీ పునర్నిర్మాణానికి పూనుకున్నారు. విషయం తెలుసుకున్న పూసల సంఘానికి చెందిన సింగ్‌లు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా ఆలయం వద్దకు చేరుకున్నారు.

ఆలయ ప్రహరీగోడ తామే నిర్మిస్తామని, తమకు చెప్పకుండా ఎలా నిర్మాణాలు చేస్తారంటూ గ్రామస్తులను ప్రశ్నించారు. ఆపై భారీగా చేరుకున్న సింగ్‌లు ఆలయంలో తిష్టవేసి, గ్రామస్తులను లోపలకు రాకుండా అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం తారా స్థాయికి చేరుకుంది. ఈ క్రమంలో ఇరువర్గాల వారు స్వల్పంగా ఘర్షణ పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు యత్నించారు. అయితే అమ్మవారికి ప్రతి ఏటా నిత్య కైంకర్యాలతో పాటు దసరా ఉత్సవాలను సైతం వేడుకగా నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. తమ గ్రామ దేవత ఆలయంలోకి తమను రాకుండా అడ్డుకోవడం ఏమిటని మండిపడ్డారు. ఈ క్రమంలో తరతరాలుగా క్రితం తమ పూర్వీకులు అమ్మవారిని ప్రతిష్ఠించినట్లు సింగ్‌లు చెబుతున్నారు. ఏడాదికి మూడు రోజులు వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసుకుంటున్నామని, రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణ, ఉత్తర భారతదేశం నుంచి సింగ్‌లు ఇక్కడ వస్తున్నారని తెలిపారు. ఆలయ అభివృద్ధిలో కీలకంగా తామే వ్యవహరించామని, ఇప్పటికి ఆలయ విద్యుత్ బిల్లులను సైతం తామే చెల్లిస్తున్నట్లు వారు తెలిపారు. 1941లో ఆలయ జీర్ణోద్ధరణ పనులను సైతం తమ పూర్వీకులు నిర్వహించిన కరపత్రాలను సైతం చూపించారు. రంగంలోకి దిగిన సీఐ సుబ్బరామిరెడ్డి ఇరువర్గాలకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఇరువర్గాల పెద్దలు సాయంత్రం లోపు మాట్లాడుకుని వివాదం లేకుండా అమ్మవారి ఆలయ వ్యవహారాలు నిర్వహించాలని సూచించడంతో గ్రామస్తులు, సింగ్‌లు రాజీకి వచ్చారు. దీంతో గురువారం సాయంత్రం వరకు వివాదం తాత్కాలికంగా సద్దుమణిగినట్లు అయ్యింది.

ఐదు కిలోల గంజాయి స్వాధీనం

తిరుపతి క్రైమ్: నగరంలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. ఈస్ట్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి ఎస్‌టీవీ నగర్‌కు చెందిన అరవింద(22) ఇప్పటికే అన్నవరంలో ముద్దాయిగా ఉన్నాడు. ఇతనికి ఒడిశా రాష్ట్రం, చిత్రకొండకు చెందిన గణేష్‌ను అన్నవరంలో పరిచయం చేసుకున్నాడు. ఇతని వద్ద లక్ష ఇచ్చి ఐదు కిలోల గంజాయిని కొనుగోలు చేసి తిరుపతి ఆర్టీసీ బస్టాండ్‌కి తీసుకొచ్చాడు. పోలీసులు అతన్ని అరెస్ట్ చేశారు.

చంద్రగిరిలో క్షుద్రపూజల కలకలం

- అర్ధరాత్రి టీడీపీ మద్దతురాలి దుశ్చర్యలు
- అడ్డుకున్న పోలీసులు



విచారిస్తున్న పోలీసులు

చంద్రగిరి: చంద్రగిరి చుట్టు పక్కల ప్రాంతాల్లో గుప్తనిధులు ఉన్నాయన్న అత్యాశతో అధికార పార్టీకి చెందిన ఓ మహిళ అర్ధరాత్రి వేళ తవ్వకాలు చేపట్టేందుకు క్షుద్రపూజలు చేయడం స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు, పోలీసుల వివరాలు.. మల్లయ్యపల్లికి చెందిన టీడీపీ మద్దతురాలు అమ్ములు గత కొంత కాలంగా గుప్త నిధుల కోసం గుట్టుచప్పుడు కాకుండా క్షుద్రపూజలను చేస్తోంది. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మల్లయ్యపల్లి సమీపంలోని ధనేశమ్మ ఆలయ సమీపంలోని ఓ మామిడితోటలో కొంత మంది మంత్రగాళ్లతో కలసి క్షుద్రపూజలకు ఉపక్రమించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షుద్రపూజలను అడ్డుకున్నారు.

బెదిరింపులకు యత్నం

క్షుద్రపూజలను అడ్డుకున్న పోలీసులకు అమ్ములు అధికార పార్టీ అండదండలు ఉన్నాయంటూ బెదిరించేందుకు యత్నించినట్లు తెలుస్తోంది. తిరుపతి రూరల్ మండలానికి చెందిన ఓ నేత తన వెనుక ఉన్నాడంటూ పోలీసులను బెదిరించినట్లు స్థానికులు చెబుతున్నారు. గతంలోనూ సదరు మహిళా ప్రభుత్వ పోరంబోకు భూమిని అక్రమించి కాంప్లెక్స్ నిర్మాణం చేసే సమయంలో కూడా ఇలానే అధికార పార్టీ నేతల పేర్లు చెప్పినట్టు ఆరోపణలు న్నాయి.

దేవతకు పూజ చేస్తున్నామంటూ బుకాయింపు

క్షుద్రపూజల ఆనవాళ్లు స్పష్టంగా ఉండడంతో పోలీసులు సైతం గట్టిగానే అమ్ములుకు సమాధానం చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో తాము గుప్త నిధుల కోసం ఎలాంటి తవ్వకాలు జరపలేదని, దేవతకు పూజ చేస్తున్నట్లు బుకాయించినట్టు తెలుస్తోంది. అనంతరం అక్కడ పూజా సామాగ్రిని చెల్లాచెదురు చేశారు. అనంతరం సాయంత్రం అమ్ములును స్టేషన్‌కు పిలిపించి పోలీసులు విచారణ చేస్తున్నారు.

కల్తీ నెయ్యి కేసులో ముగిసిన కస్టడీ

తిరుపతి లీగల్: తిరుమలకు కల్తీ నెయ్యి తరలిస్తున్నారన్న అభియోగాల కింద నమోదైన కేసులో ఇద్దరికి మూడు రోజుల కస్టడీ గురువారంతో ముగిసింది. దీంతో కేసులో మూడవ నిందితుడిగా అభియోగాలు ఎదుర్కొంటున్న వైష్ణవి డెయిరీ డైరెక్టర్ విపిల్ జైన్, 5వ నిందితుడిగా అభియోగాలు ఎదుర్కొంటున్న వైష్ణవి డెయిరీ సీఈఓ అపూర్వ వినయకాంత్ చావడాలను మూడు రోజులపాటు పోలీసు కస్టడీకి ఇస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వర రావు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. దీంతో పోలీసులు వారిని జుడిషియల్ కస్టడీ నుంచి తమ కస్టడీకి తీసుకుని విచారించారు. గురువారంతో కస్టడీ కాలం ముగియడంతో పోలీసులు ఇద్దరినీ తిరిగి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఇద్దరినీ తిరిగి జ్యుడీషియల్ కస్టడీకి తరలిస్తూ ఆదేశాలు జారీచేశారు. కేసులో నిందితులుగా అభియోగాలు ఎదుర్కొంటున్న నలుగురు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌లపై సోమవారం వాదనలు జరగనున్నట్లు తెలిసింది.

దళారీ అరెస్ట్

తిరుమల : టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఫొటోలను వాట్సాప్ డీపీగా పెట్టుకుని, చైర్మన్ పీఆర్వో అని నమ్మిస్తూ శ్రీవారి సేవా, దర్శన టికెట్లు ఇప్పిస్తామని మోసగిస్తున్న ఘరానా మోసగాడిని తిరుమల టూటౌన్ పీఎస్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. టూటౌన్ పీఎస్ సీఐ శ్రీరాముడు తెలిపిన వివరాల మేరకు.. చంద్రగిరికి చెందిన ఫరూక్ అలియాస్ ప్రసాద్(35) ప్రస్తుతం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కోవూరులో నివాసం ఉంటున్నాడు. ఇతను గత నాలుగు నెలల నుంచి 'తిరుమల సమాచారం' అనే వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేసి అందులో సుమారు 600 మందిని సభ్యులుగా చేర్చి తిరుమలలో శ్రీవారి దర్శనం కావాలంటే తనను సంప్రదించండి అని మేసేజ్‌లు రాసి పోస్ట్ చేసేవాడు. దాన్ని నమ్మిన గ్రూప్‌లోని భక్తులు అతన్ని వాట్సాప్ కాల్ ద్వారా కాంటాక్ట్ అవుతారు. దీంతో నిందితుడు వారికి దర్శనం ఇప్పిస్తామని చెప్పి వారి వద్ద నుంచి ఫోన్ పే ద్వారా నగదు వేయించుకుని మోసగించేవాడు. ఈ విధంగా సుమారు రూ.80వేలు తీసుకుని మోసగించాడు. నిందితుడిపై చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో మూడు కేసులు ఉండగా ఇందులో మూడు నెలలు జైలు శిక్షను సైతం అనుభవించాడు. పోలీసులు చాకచక్యంగా ప్రసాద్‌ను అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి సెల్‌ఫోన్, ఆరు సిమ్ కార్డులు, బ్యాంక్ పాసు పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు.

దళారులను నమ్మి మోసపోకండి : భక్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ దళారులు నమ్మి మోసపోవద్దని సీఐ శ్రీరాముడు సూచించారు. ఎవరైనా దళారులను గుర్తిస్తే వారి వివరాలను తీసుకుని తిరుమల పోలీసులను 0877-2289027లో సంప్రదించాలని సూచించారు.

జీతాలు ఇవ్వాలని కార్మికుల నిరసన



తిరుపతి రూరల్ : 'మేము గాంధీపురం పంచాయతీలో పాతికేళ్లుగా పనిచేస్తున్నాం. గత రెండు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. కుటుంబాలను ఎలా పోషించుకోవాలి' అని కార్మికులు వాపోయారు. వారు గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నేతలు పంచాయతీ కార్యదర్శిపై ఒత్తిడి చేసి ఆరుగురు కార్మికులను విధుల నుంచి తొలగించారు. సర్పంచ్ లక్ష్మీ శివ దీనిపై అభ్యంతరం తెలిపారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారినే కొనసాగించాలని తీర్మానం చేసి కార్యదర్శి లతశ్రీకి పంపించారు. అధికార పార్టీ వారి ఒత్తిళ్లతో కార్మికులకు జీతాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు. ఈ క్రమంలో 34 మంది కార్మికులకు జీతం అందలేదు.

అమ్మానాన్నా.. వెళ్లిపోయారా?

విధి ఆడిన వింత నాటకంలో ఆ కుటుంబం చిన్నాభిన్నమైంది. భార్య, చిన్నకుమార్తెతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా మృత్యువు రూపంలో ఆటో దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో తన కళ్లెదుటే తల్లిదండ్రులు కన్నుమూయడం ఆ బాలిక మనసును కలచివేసింది. తన గాయాలు లెక్కచేయక అమ్మా..నాన్నా..! మాట్లాడండి నాన్నా..? అంటూ రోదించిన తీరు చూపరులను కంట తడి పెట్టించింది. మరో బాలిక ఆస్పత్రికి చేరుకుని చికిత్స పొందుతున్న చెల్లిని, విగత జీవులుగా పడి ఉన్న తల్లిదండ్రులను చూసి గుండెలు బాదుకున్న తీరు అక్కడి వారిని కంటతడి పెట్టించింది.



ప్రమాదానికి కారణమైన ఆటో



నుజ్జునుజ్జయిన స్కూటీ



మృతి చెందిన జ్యోతి(ఫైల్)



మునెయ్య (ఫైల్)

సైదాపురం-తిప్పవరపాడులో ఘోర ప్రమాదం

- స్కూటీని ఢీకొట్టిన ఆటో
- తల్లిదండ్రులు మృతి
- అనాథలైన ఇద్దరు కుమార్తెలు
- సైదాపురంలో విషాద ఛాయలు

సైదాపురం/గూడూరు రూరల్: 'అమ్మా..నాన్నా మమ్మల్ని వదిలి వెళ్లిపోయారా..! అంటూ తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్న కుమార్తె, ఆమె అక్క రోదించడం స్థానికంగా కలచివేసింది. సైదాపురం - తిప్పవరపాడులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులు మృతి చెందగా.. చిన్న కుమార్తె తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలైన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. స్థానికులు, గూడూరు రూరల్ పోలీసుల వివరాల మేరకు.. శ్రీపొట్టిశ్రీరాముల నెల్లూరు జిల్లా, సైదాపురానికి చెందిన దొడ్డగ మునెయ్య బట్టల దుకాణం నడుపుకుంటున్నారు. భార్య జ్యోతి టైలరింగ్ చేస్తూ కుటుంబానికి ఆదరువుగా ఉండేది. ఈ క్రమంలో వారికి నిహారిక, వైష్ణవి ఇద్దరు ఆడ బిడ్డలు ఉన్నారు. వారు స్థానిక పాఠశాలల్లో 8, 7 తరగతులు చదువుకుంటున్నారు. మునెయ్య బంధువులు కోట మండలంలోని విద్యానగర్‌లో ఉండడంతో వారి వద్దకు వెళ్లేందుకు భార్య జ్యోతి, చిన్న కుమార్తె వైష్ణవిని తీసుకుని స్కూటీపై వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో సైదాపురం నుంచి గూడూరు వైపు వస్తున్న ఆటో స్కూటీని ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మునెయ్య, జ్యోతిలిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. వైష్ణవికి తీవ్ర గాయాలు కావడంతో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. తల్లిదండ్రులు కళ్లెదుటే దుర్మరణం చెందడంతో బాలిక్ షాక్‌కు గురైంది. అమ్మా..నాన్న వెళ్లిపోయారా..అంటూ కన్నీటిపర్యంతమవడం స్థానికులను కలచివేసింది.

మార్చి.. ఏమార్చి..

ఒకప్పుడు మామూలు కారు ఇంట్లో ఉంటే గొప్పగా చెప్పుకునేవారు. ఇప్పుడు ఖరీదైన కారు కొన్నా భిన్నంగా ఉంటేనే గొప్ప. రూ.లక్షలు, రూ.కోట్లు పెట్టి కారు కొన్నా పెద్దగా చెప్పుకునే పరిస్థితి లేదు. దాన్ని మరింత స్టైల్‌గా, విభిన్నంగా చూపించాలనే ఎక్కువ మంది తాపత్రయ పడుతున్నారు. బైక్‌ల పరిస్థితి కూడా అలాగే ఉంది. తద్వారా ఆర్టీఏ నిబంధనలకు నీళ్లు వదులుతున్నారు. కేసుల బారిన పడుతున్నారు.

- ఇష్టారీతిన మార్పులు చేర్పులు
- ఆర్టీఏ నిబంధనలు పాటించని యజమానులు
- నింబధనలకు లోబడే కార్లు, బైక్‌ల మార్పులుండాలి
- జిల్లా రవాణాశాఖాధికారి మురళీమోహన్



తిరుపతి మంగళం : ప్రస్తుతం మార్కెట్‌లోకి వివిధ మోడళ్ల కార్లు, బైక్‌లు వస్తున్నాయి. ఒకదాన్ని మించి ఒకటి విభిన్నంగా ఉంటున్నాయి. వాటిలోని ఫీచర్లు కూడా వేర్వేరుగా ఉంటున్నాయి. వాహనాలను కొనుగోలు చేసేవారు తమ ఇష్టానుసారం ఫీచర్లను మార్చుకుంటున్నారు. ఇలాంటి మార్పు చేర్పులు తప్పు మాత్రమే కాదు. ముప్పని నేషనల్ రోడ్డు సేఫ్టీ కౌన్సిల్ సభ్యులు, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ రోడ్ సేఫ్టీ వారు చెబుతున్నారు. వాహన తయారీదారులు నిర్దిష్ట మోడల్‌ను ఉత్పత్తి చేయడానికి అధికారుల నుంచి చట్టపరమైన అనుమతులు తీసుకుంటారు. వాటిని ట్యాంపరింగ్ చేయడం వల్ల వాహనం దాని ఒరిజినల్ కొలతలు ఏరోడైనమిక్‌లను కోల్పోతాయి. తద్వారా అది నడిపే వారితో పాటు ఇతరులకు ప్రమాదకరంగా మారుతుంది. బైకర్స్ తమ సైలెన్సర్లు, టెయిల్ ల్యాంపులను మారుస్తారు. ఈ మార్పులు ఇతరులకు అసౌకర్యాన్ని కలిగిస్తాయి. ఏదైనా వాహనం ఇంటీరియల్స్ లేదా ఎక్స్‌టీరియల్స్ సవరించడం చట్టవిరుద్ధం.

మనం కొన్న కారే కానీ...

ఎంత చెట్టుకు అంత గాలి అన్నట్టే ఎంత డబ్బు ఉంటే అంత కారు కొనుక్కోవచ్చు తప్పులేదు. కానీ ఎంత ఖర్చు పెట్టి కొన్న కారైనా, బైక్ అయినా మనం ఇష్టమొచ్చినట్లు మార్పులు, చేర్పులు చేసుకుంటామంటే చట్టం ఒప్పుకోదు. వాహనం రంగు కావచ్చు, రూపంలో కావచ్చు, ఏవైనా మార్పులు చేర్పులను చేయాలంటే ప్రాంతీయ రవాణా కార్యాలయం వాటిని ఆమోదించాలి. నింబధనలు ఉల్లంఘిస్తే కేసుల బారిన పడక తప్పదని అధికారులు హెచ్చరిస్తున్నారు.

చట్టం ఏమి చెబుతోంది...

వాహనంలో అనధికారిక మార్పులు చేసినట్లు తేలితే ఒక సంవత్సరం వరకు జైలు శిక్ష, రూ.లక్ష వరకు జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది. ఆర్టీఏ నుంచి అనుమతి లేకుండా మార్పులు చేసిన వాహనాలను సీజ్ చేస్తారు. వాహనాల రూపాన్ని పనితీరును మెరుగుపరచడానికి కొన్నింటికి మాత్రమే అనుమతులు ఉంటాయి. కార్లు లేదా మోటార్ సైకిళ్లకు అదనపు పరికరాలను అమర్చడం లేదా ధ్వనులను మార్పు చేయడం వంటివి మోటారు ట్రాఫిక్ చట్టాల ఉల్లంఘన కిందికి వస్తాయి.

చేయకూడని మార్పులు

తయారీ దారుడు వాహనాన్ని మార్కెట్‌లోకి పంపేముందు సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకుంటారు. భద్రత, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆ వాహనం బరువు, రూపం, తదితరాలను ఖరారు చేస్తారు. అలా వచ్చిన వాహనానికి ఎలాంటి మార్పులూ చేయకూడదు. దీంతో పాటు నంబర్ ప్లేట్లు, సైలెన్సర్స్ మార్చడం వంటివి చేయకూడదు. విండో షీల్డ్స్, విండో గ్లాసులకు బ్లాక్ ఫిల్మ్స్ తగిలించకూడదు.

– జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్

తస్మాత్ జాగ్రత...

- వాహన మార్పుల వల్ల వాహనానికి ఏదైనా నష్టం జరిగితే తయారీదారు వారెంటీ చెల్లదు.
- కార్ల యజమానులు తరచూ చేసే మార్పుల్లో లేతరంగు విండోస్ ఒకటి, దీని వల్ల విండోస్ 25 శాతం కంటే తక్కువ లైట్ ట్రాన్స్‌మిషన్ స్థాయిని కలిగి ఉండడం వల్ల ఇతర వాహనాలను గమనించే సామర్థ్యాన్ని అడ్డుకుంటుంది.
- మార్పుల వల్ల కొన్ని వాహనాల పనితీరు మందగిస్తుంది.
- కొందరు యజమానులు తమ వాహనాన్ని వీలైనంత మేర మోడిఫై చేస్తుంటారు. దీని వల్ల భారీగా నష్టపోయే ప్రమాదం ఉంది.
- సస్పెన్షన్ అప్‌గ్రేడ్లు, టర్బోచార్జ్ జోడించడం, స్పోర్ట్స్ సీట్లను ఇన్‌స్టాల్ చేయడం వంటి మార్పులు చేస్తుంటారు. ఇవి వాహన పనితీరును దెబ్బతీస్తాయి.

క్లుప్తంగా

జగన్‌ను కలిసిన హరిప్రసాద్



తిరుపతి సిటీ: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువరంతాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి సంఘం సీనియర్ నాయకుడు వి.హరిప్రసాద్‌రెడ్డి కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన, స్కాలర్‌షిప్‌లు, అమ్మ ఒడి తదితర పథకాలు నిలిపేసిందన్నారు. దీంతో విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలపై మాజీ సీఎంతో చర్చించినట్టు తెలిపారు.

జాబ్ మేళాలో 38మందికి ఉద్యోగాలు

తిరుపతి ఎడ్యుకేషన్/తిరుపతి రూరల్ : తిరుపతిలోని డాక్టర్ ఆర్సీ రెడ్డి డిగ్రీ కళాశాలలో గురువారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో జాబ్ మేళా నిర్వహించారు. ఇందులో 5 కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ప్రతిభ కనబరిచిన 38 మంది ఉద్యోగాలకు ఎంపికచేశారు. వారిని కళాశాల కరస్పాండెంట్ ఆర్సీరెడ్డి అభినందించారు.

వీధి లైట్లు వేయాలని వినతి

తిరుపతి రూరల్ : తుమ్మలగుంట పంచాయతీలోని గ్రామాల్లో వీధి లైట్లు వేయాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బిరుదాల భాస్కర్ రెడ్డి కోరారు. ఆయన గురువారం స్థానికులతో కలిసి తుమ్మలగుంట పంచాయతీ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు.

సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

పాకాల : మండలంలోని మొగరాలలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని గురువారం తిరుపతి ఎస్ఈ (ఆపరేషన్) సురేంద్రనాయుడు పరిశీలించారు. స్థలం అనువుగా ఉందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి రూరల్ ఈఈ చిన్నారెడ్డి, కన్‌స్ట్రక్షన్స్ ఈఈ బాలాజి, డీఈ జీవన్‌కుమార్‌రెడ్డి, కన్‌స్ట్రక్షన్స్ డీఈ భాస్కర్‌నాయుడు, ఏఈలు హరిప్రసాద్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఘనంగా మాతృశ్రీ టెక్నో స్కూల్ వార్షిక వేడుకలు



మాట్లాడుతున్న వీసీ జీఎస్ఆర్.కృష్ణమూర్తి

తిరుపతి కల్చరల్: తిరుపతి మహతి కళాక్షేత్రంలో గురువారం మాతృశ్రీ టెక్నో స్కూల్ 16వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్.కృష్ణమూర్తి, ఏబీవీపీ పూర్వ జాతీయ కార్యదర్శి ఎన్.హరికృష్ణ, సైకాలజిస్టు సుధాకర్‌రెడ్డి, డాక్టర్ మహేంద్ర చౌదరి వేడుకలను ప్రారంభించారు. జీఎస్ఆర్.కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని తెలిపారు. మాతృశ్రీ టెక్నో స్కూల్ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని, వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు, కరస్పాండెంట్ సుధాకర్ నాయుడు కృషి అభినందనీయమన్నారు. పాఠశాల కరస్పాండెంట్ సుధాకర్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

శుభాకాంక్షలు



వధూవరులతో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

పాకాల : పెద్దరామాపురం ఎంపీటీసీ మునిరత్నంనాయుడు కుమార్తె వాసంతి, మోహన్‌నాయుడు వివాహం గురువారం స్థానిక సుబ్రమణ్యస్వామి ఆలయంలో జరిగింది. ఇందులో వైఎస్సార్ సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు హర్షిత్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, డివిజన్ అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, కపిలేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ లింగయ్య, హరినాయుడు, ఈశ్వరయ్య, భాను తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు అవగాహన

పాకాల : మండలంలోని దామలచెరువు పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మామిడిలో ఫ్రూట్ కేర్ యాక్టివిటీస్, మార్కెటింగ్‌పై రైతులకు సెమినార్ నిర్వహించారు. తిరుపతి జిల్లా ఉద్యాన అధికారి బి.దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ రైతులు సంఘాలను ఏర్పాటు చేసుకుని మ్యాంగో గుజ్జు పరిశ్రమలతో సత్సంబంధాలు కలిగి ఉండడం వల్ల దళారుల వ్యవస్థను అరికట్టవచ్చని తెలిపారు. మామిడి కాయకు కవర్స్ కట్టడం వల్ల నాణ్యత పెరుగుతుందన్నారు. హెక్టారుకు 10 వేల కవర్స్ అవసరమవుతాయని, ప్రభుత్వం రూ.10 వేలు రాయితీ ఇస్తుందన్నారు. రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలని తెలిపారు. రాస్ కేవీకే సీనియర్ శాస్త్రవేత్త పి.ఎస్.సుధాకర్ మాట్లాడుతూ మామిడి పిందె దశలో ఉన్నప్పుడు ఎండ తీవ్రతను బట్టి 7 లేదా 10 రోజులకు ఒకసారి నీరు పెట్టాలని సూచించారు. రోజూ నీరు పెడితే పిందెలు రాలిపోతాయని, తెగుళ్లు విజృంభిస్తాయన్నారు. వేడి శాతం, గాలిలో తేమ శాతం పెరగడం వల్ల నల్ల తామర పురుగు ఉధృతి ఎక్కువ అవుతుందన్నారు. మండల ఉద్యాన అధికారిణి ఎస్.శైలజ, ఏవో పుష్పలత, విశ్రాంత ఉద్యాన అధికారి సుబ్బారెడ్డి, సర్పంచ్ సునిత పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మహిళా వర్సిటీ అధ్యాపకులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్

తిరుపతి సిటీ: మహిళలు ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ వహించాలని రుయా జనరల్ మెడిసన్ ప్రొఫెసర్ డాక్టర్ రుష్యేంద్ర సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా వర్సిటీ హోమ్ సైన్స్ విభాగం, న్యూట్రీషియన్ సోసైటీ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ సంయుక్తంగా గురువారం మహిళలు–ఆరోగ్యం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. అరుణ, సుచరిత, బిందు, శిరీష, రోటరీ హ్యూమన్ మిల్క్ బ్యాంక్ కమిటీ చైర్మన్ దామోదరం, భారతి, శాంతి పాల్గొన్నారు.

మహిళా వర్సిటీ సిబ్బందికి బోన్ డెన్సిటీ పరీక్షలు

మహిళా అధ్యయన కేంద్రం విభాగం, దినేష్ కల్పన ఆస్పత్రి సౌజన్యంతో సిబ్బందికి బోన్ మినరల్ డెన్సిటీ, ఆర్థోపెడిక్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. డాక్టర్ దినేష్ కుమార్ దొడ్ల మాట్లాడుతూ ఎముకలు బలహీనపడటానికి వయస్సు పెరుగుదల, పోషకాహార లోపం, శారీరక వ్యాయామం లేమి తదితరాలు కారణమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నాగేంద్రకుమార్, మహిళా అధ్యయన విభాగం ఇన్‌చార్జి డాక్టర్ నీరజ, అధ్యాపకులు మాధవి, హైమావతి, ఉమ, రాణి, సుచరిత, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు మార్గదర్శి స్క్వేయర్ కన్సల్టెన్సీ



స్క్వేయర్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: విద్యార్థుల ఉన్నత లక్ష్యాలకు మార్గదర్శిగా స్క్వేయర్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ సర్వీసెస్ పనిచేస్తుందని ఆ సంస్థ డైరెక్టర్లు రమణ, రాజశేఖర్ పేర్కొన్నారు. స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డులో ఏర్పాటుచేసిన స్క్వేయర్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీని గురువారం ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు ప్రారంభించారు. కన్సల్టెన్సీ డైరెక్టర్లు మాట్లాడుతూ తమ సంస్థ 18 ఏళ్లుగా తమిళనాడులోని ఎస్ఆర్ఎం, అమృత, వీఐటీ సాయి, తక్షశిల వర్సిటీ వంటి పేరొందిన డీమ్డ్ వర్సిటీల్లో ఎంతో మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించినట్టు తెలిపారు. కర్ణాటకలో పేరొందిన అన్ని వర్సిటీల్లో అడ్మిషన్లు పొందేందుకు గైడెన్స్ అందిస్తామని తెలిపారు. ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఫీజు రాయితీ, స్కాలర్‌షిప్ అందించే ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎంబీబీఎస్ అడ్మిషన్లలో చిత్తూరు అపోలో, నారాయణ, నంద్యాల శాంతిరామ్ మెడికల్ కళాశాలలో ప్రవేశాలకు గైడెన్స్ అందజేస్తామన్నారు. వివరాలకు 9640777757, 8106020030లో సంప్రదించాలని కోరారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు పక్కా ప్రణాళికలు



అధికారులతో సమీక్షిస్తున్న స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ మౌర్య

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు పక్కగా ప్రణాళికలు సిద్ధం చేయాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ మౌర్య అధికారులను ఆదేశించారు. ఆమె గురువారం సిటీ ఆపరేషన్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, డిజైన్ స్టూడియో, గ్లో గార్డెన్, గరుడ వారధి తదితర ప్రాజెక్టుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసు, హెల్త్, ప్రణాళికా విభాగం అధికారుల పర్యవేక్షణలో ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. డిజైన్ స్టూడియో ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఈఈ రవి, డీఈలు రాజు, మహేష్, మధు, ఏసీపీ బాలాజీ, ఏవో రాజశేఖర్, సీఎఫ్‌వో మల్లికార్జున పాల్గొన్నారు.

పారిశుద్ధ్య మహిళా కార్మికులకు సత్కారం



ప్రజాకళా వేదిక పురస్కారాల సత్కారం అందుకున్న పారిశుద్ధ్య కార్మికులు

తిరుపతి కల్చరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజాకళావేదిక ఆధ్వర్యంలో గురువారం ప్రెస్‌క్లబ్‌లో పారిశుద్ధ్య మహిళా కార్మికులను సత్కరించారు. తుడా కార్యదర్శి జి.వెంకటనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పురుషులతో పాటు మహిళలకు సమాన హక్కులు కల్పించినప్పుడే దేశ గౌరవం దిశ దశలా వ్యాపిస్తుందన్నారు. ప్రజాకళావేదిక సంస్థ అధినేత అరవ జయపాల్ మాట్లాడుతూ సమాజంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని గౌరవించడమే ప్రజా కళావేదిక లక్ష్యమన్నారు. రుయా వైద్యురాలు రోజారమణి మాట్లాడుతూ మహిళలు శుభ్రత పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం 30 మంది మహిళా కార్మికులకు పురస్కారాలు అందజేసి సత్కరించారు.

సృష్టికి మూలం మహిళే

తిరుపతి సిటీ: ప్రపంచ సృష్టికి మూలం మహిళేనని, వారిని గౌరవించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. కళాశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మద్దూరి పద్మావతమ్మ, వైస్ ప్రిన్సిపాల్ పరమేశ్వర, కన్వీనర్ శకుంతల, ఉమామహేశ్వరి, వెంకటరమణమ్మ, వసంతకుమారి, సృజన, మంజుల, జయలక్ష్మీ, చాందిని పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

తిరుపతి ఎడ్యుకేషన్ : చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని తిరుపతి డీవైఈఓ కె.బాలాజీ తెలిపారు. బైరాగిపట్టెడలోని ఎంజీఎం నగరపాలక హైస్కూల్లో గురువారం పదో తరగతి విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యకు పదో తరగతి కీలకమన్నారు. ఆందోళనకు లోనుకాకుండా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. ఎంఈఓ బి.భాస్కర్‌నాయక్ మాట్లాడుతూ పదో తరగతి అనంతరం నచ్చిన, ఇష్టపడిన కోర్సును ఎంచుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని ఎం.మునిశారద, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధికి కృషి

తిరుపతి అర్బన్: పరిశ్రమల అభివృద్ధిని కృషి చేస్తామని సీఐఐ (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) రీజియన్ చైర్‌పర్సన్ డాక్టర్ నందిని తెలిపారు. తిరుపతి నగరం బైరాగిపట్టెడలో ఏర్పాటుచేసిన నూతన కార్యాలయాన్ని ఆమె గురువారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పరిశ్రమల అభివృద్ధికి తిరుపతి బలమైన వేదికగా తీసుకురావడానికి అవసరమైన వ్యూహాత్మక ప్రాముఖ్యతను వివరించారు. సీఐఐ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రాంతీయ అభివృద్ధిని ప్రోత్సహించడానికి తిరుపతిలో కొత్త కార్యాలయం ఏర్పాటుచేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీఐఐ తిరుపతి చైర్మన్ పుష్పిత్ గార్గ్, వైస్ చైర్మన్ జగన్నాథ్ అనిరుధ్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు

తిరుపతి అర్బన్ : తిరుపతి నగరంలో 2019కి ముందు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్న వారు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కేపీ భాగ్యలక్ష్మి తెలిపారు. కరెంట్ బిల్లు, ఇంటి పన్ను, సంబంధిత పత్రాలు జత చేయాలని పేర్కొన్నారు. దరఖాస్తులను సచివాలయంలోని వీఆర్వోకు అందించాలని స్పష్టం చేశారు.


బీఎన్ఐ డైమండ్స్‌తో వ్యాపారాభివృద్ధి

తిరుపతి కల్చరల్: బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్(బీఎన్ఐ) వేదిక ద్వారా స్థానిక వ్యాపారులు గ్లోబల్ స్థాయికి ఎదిగే అవకాశం ఉందని బీఎన్ఐ డైమండ్స్ తిరుపతి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ తెలిపారు. ఓ ప్రవేటు హోటల్‌లో గురువారం 150 మంది వ్యాపారులతో బీఎన్ఐ డైమండ్స్ తిరుపతి చాప్టర్‌ను ఆయన ప్రారంభించారు. బీఎన్ఐ తిరుపతి చాప్టర్ అధ్యక్షుడు టెంకాయల దుర్గాప్రసాద్, సీనియర్ సపోర్ట్ డైరెక్టర్ సాయికిరణ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు యువరాజ్‌జైన్, కార్యదర్శి డి.దేవి, లీడ్ విజిటర్ పోస్ట్ హరికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విశ్రాంత హెచ్‌ఎం ఆగడాలను అరికట్టండి

పాకాల : విశ్రాంత హెచ్‌ఎం రామయ్య తన భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని, అతని ఆగడాలను అరికట్టాలని కుక్కలపల్లికి చెందిన అరుణ తెలిపారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడారు. సర్వే నంబర్ 2167/2, 2169/1లో వున్న నాలుగు ఎకరాల భూమిని తన భర్త గౌడుగుచింత ప్రసాద్ తాతలకు ప్రభుత్వం కేటాయించిందన్నారు. 50 ఏళ్ల నుంచి పంటలు సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ఇటీవల అదే గ్రామానికి చెందిన రామయ్య పది మందికి పైగా తన అనుచరులతో వచ్చి భూమిని విక్రయించాలని అడిగినట్టు తెలిపారు. తాము నిరాకరించడంతో కక్ష కట్టి ఒంటరిగా వెళుతున్న తనపై దాడికి పాల్పడినట్లు తెలిపారు. తమకు సహాయం అందించిన సీఐ ఆశీర్వాదంపై బురద జల్లేందుకు కుట్ర పన్నుతున్నాడని ఆరోపించారు. అతని ఆగడాలను అరికట్టి తమకు న్యాయం చేయాలని కోరారు. రాయలసీమ సీపీఐ కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ బాధితురాలు అరుణకు తాము అండగా ఉంటామన్నారు.

కొనసాగుతున్న జూడాల సమ్మె



32వరోజు సమ్మెలో పాల్గొన్న వెటర్నరీ జూడాలు

తిరుపతి సిటీ: గౌరవవేతనం పెంచాలని వెటర్నరీ జూడాలు చేస్తున్న సమ్మె గురువారానికి 32వ రోజుకు చేరింది. వర్సిటీ అధికారుల మొండి వైఖరికి నిరసనగా వారు బుధవారం వర్సిటీని దిగ్బంధించిన విషయం తెలిసిందే. గురువారం వర్సిటీ ప్రాంగణంలో బైటాయించారు. వారితో జిల్లా ఎస్పీ మాట్లాడి బుధవారం సంఘటనపై ఆరా తీసినట్లు సమాచారం. వర్సిటీ ఉద్యోగులకు ఆటంకం కలిగించరాదని విద్యార్థులకు సూచించినట్లు తెలిసింది.

హిజ్రాల అరాచకాలపై కేసు నమోదు

తిరుపతి క్రైం : ఎర్రమిట్ట కాలనీలో ఒక ఇంట్లోకి చొరబడి అరాచకానికి పాల్పడిన హిజ్రాలపై కేసు నమోదు చేసినట్లు అలిపిరి ఎస్ఐ లోకేష్ తెలిపారు. ఆయన గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. మహాశివరాత్రి రోజు ఎర్రమిట్టకు చెందిన కపిల్ దుర్గం గుడికి వెళ్లాడు. అక్కడున్న హిజ్రాలు డబ్బులు అగడంతో రూ.50లను ఫోన్ పే చేశాడు. వారు ఇంకా 20 వేలు ఇవ్వాలని, లేకుంటే కేసు పెడతామని బెదిరింపులకు దిగారు. దీంతో అతను ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నా డు. ఆరుగురు హిజ్రాలు ఆటోలో ఇంటికి వెళ్లి దాడి చేశారు. స్థానికులు రావడంతో పారిపోయారు. బాధితుడు అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. దాడిలో ధన, మోగి, అక్షర, సాయిప్రియ, హేమంత్, నవీను, తన్వి, ఆటో డ్రైవర్ పాల్గొన్నట్టు గుర్తించామన్నారు.

అంతర్జాతీయ సదస్సు కరపత్రం ఆవిష్కరణ

తిరుమల: ఎస్వీయూ వృక్ష శాస్త్ర విభాగం ప్రొఫెసర్ జె కామాక్షమ్మ ఆధ్వర్యంలో ఏప్రిల్ 9 నుంచి 11 వరకు సంప్రదాయ ఔషధం- ఆధునిక, సహజ ఆరోగ్య రక్షణ ఏకీకృత విధానం అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు సదస్సు కరపత్రాలను గురువారం తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక చికిత్స విధానంలో సంప్రదాయ ఔషధం అనుసంధానం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వృక్ష శాస్త్ర విభాగాధిపతి ఆచార్య నాగలక్ష్మి దేవమ్మ, డాక్టర్ చింత చంద్ర పాల్గొన్నారు.

నగరంలో నేడు

- కొత్తవీధిలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉదయం 9 గంటలకు ఆలయ ట్రస్ట్ చైర్మన్ మీడియా సమావేశం.
- టీటీడీ పరిపాలన భవనం ఆవరణలోని క్రీడా మైదానంలో టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీలు.
- టీటీడీ పరిపాలన భవనం వద్ద ఉదయం 10 గంటలకు చింతామోహన్ నిరసన.
- పద్మావతిపురంలోని మాజీ ఎమ్మెల్యే భూమన నివాసం వద్ద ఉదయం 10 గంటలకు మహిళా దినోత్సవం. టీటీడీ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు మహతి కళాక్షేత్రంలో మహిళా దినోత్సవం వేడుకలు.
- కచ్చపి ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు విజ్ఞాన్ స్కూల్ 29వ వార్షికోత్సవం.
- వల్లివేడులోని పీహెచ్‌సీలో ఉదయం 9 గంటలకు ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం.
- మహిళా వర్సిటీలోని ఇండోర్ స్టేడియంలో సాయంత్రం 5 గంటలకు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన ముగింపు కార్యక్రమం.
- ఇందిరా మైదానంలోని ఇండోర్ స్టేడియంలో తపాలా ఉద్యోగులకు క్యారమ్స్ క్రీడా పోటీలు ముగింపు, బహుమతులు ప్రదానం.

11న సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన దీక్ష

తిరుపతి ఎడ్యుకేషన్ : సమ్మె కాలపు ఒప్పందాలు, హెచ్ఆర్‌సీ పాలసీ అమలుకు కమిటీ ఏర్పాటు, మినిమమ్ టైం స్కేల్ అమలు తదితరాలపై ఈ నెల 11న విజయవాడలో నిరసన దీక్షలు చేపట్టనున్నట్టు సమగ్ర శిక్ష ఉద్యోగులు తెలిపారు. వారు గురువారం తిరుపతి అర్బన్ ఎంఈవో కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో దీక్షల పోస్టర్లు ఆవిష్కరించారు.

పీజీ సెట్ రద్దు చేయాల్సిందే

తిరుపతి సిటీ : ఏపీ పీజీసెట్‌ను రద్దు చేయాల్సిందేనని విద్యార్థి సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. వారు గురువారం వర్సిటీలోని అన్నపూర్ణ క్యాంటీన్ వద్ద సమావేశమై భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. వారు మట్లాడు తూ ఏపీ పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌ను రద్దు చేయాలని 20 రోజులుగా నిరసన తెలుపుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఏపీపీజీ సెట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. దమ్ముంటే వీసీ, రిజిస్ట్రార్ అడ్డుకోవాలని సవాల్ విసిరారు. 10న ఎస్వీయూ ఏడీ బిల్డింగ్ వద్ద భిక్షాటన, 11, 12వ తేదీల్లో మంత్రి లోకేష్‌కు పోస్టుకార్డులు పంపడం, 13న విద్యార్థులతో సంతకాల సేకరణ, 16న 36 గంటల నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు వెల్లడించారు.

తిరుచ్చిపై శ్రీకృష్ణుడి విహారం

తిరుపతి రూరల్ : తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ అనుబంధ శ్రీకృష్ణాలయంలో గురువారం స్వామి వారి జన్మనక్షత్రం రోహిణిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముఖ మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లుకు అభిషేకం చేశారు. సాయంత్రం రుక్మిణి సత్యభామతో కలిసి స్వామి వారు తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

